క్లుప్తంగా

వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చడం తగదు



మాట్లాడుతున్న వరుదు వంశీకృష్ణ, నాయకులు

సారవకోట: సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లను టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్ రెడ్డి టెర్రరిస్టులతో పోల్చడం విచారకరమని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మంగళవారం మాట్లాడారు. కరోనా వంటి మహమ్మారి వణికిస్తున్న సమయంలో వలంటీర్లు ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారని, అటువంటి వారిని టెర్రరిస్టులు, డాటా చౌర్యం చేస్తున్నారని ఆరోపించడం తగదన్నారు. డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, పారిశెల్లి తేజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విత్తనాల పంపిణీ



పర్లాంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న తవిటినాయుడు

జలుమూరు: రబీలో మొక్కజొన్న, వరి తరువాత పొలాలు ఖాళీగా ఉంచకుండా వేసవి పంట వేయడం వల్ల భూగర్భ జలాలను రక్షించడంతోపాటు భూసారం కూడా పెరుగుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటి నాయుడు అన్నారు. మండలంలోని పర్లాం, అంధవరం, శ్రీముఖలింగం, నగిరికటకం, అచ్యుతాపురం గ్రామాల్లో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు పెసర, మినుము విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. రైతులు అసరాల పంట ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. పప్పు దినుసులు, నూని గింజల పంటలతో నేల సారం మరింత మెరుగవుతుందన్నారు. రానున్న ఖరీఫ్ పంటల్లో ఎరువుల శాతం తగ్గించవచ్చన్నారు. వేసవి దుక్కుల వల్ల భూమిలో నీరు ఆవిరి అయిపోతుందన్నారు. రైతులు టి.మహన్‌రావు, సి.వేణు, కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మండలానికో మోడల్ పోలింగ్ కేంద్రం



నరసన్నపేట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపే లక్ష్యంగా ఎన్నికల అధికారులు వివిధ చర్యలు చేపడుతున్నారు. దీంట్లో భాగంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను ఈ ఎన్నికల్లో ఏర్పాటు చేస్తున్నారు. మండలానికో కేంద్రాలన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలు ఉండగా దీంట్లో నాలుగు కేంద్రాలను మోడల్‌గా ఎంపిక చేశారు. నరసన్నపేట టౌన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న 127వ కేంద్రాన్ని మోడల్‌గా ఎంపిక చేశారు. జలుమూరు మండలంలో రాణ ఎంపీయూపీ స్కూల్‌లో ఉన్న 68వ పోలింగ్ కేంద్రాన్ని, సారవకోట మండలం బుడితిలో ఉన్న 190వ పోలింగ్ కేంద్రాన్ని, పోలాకి మండలం ఈదులవలసలో ఉన్న 225వ పోలింగ్ కేంద్రాన్ని మోడల్‌గా ఎంపిక చేశారు. పోలింగ్ రోజున వీటిని ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు నరసన్నపేట తహసీల్దార్ పి.కనకారావు సోమవారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక క్యాబిన్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామన్నారు.

కళాకారులకు సైకత వందనం



ఆమదాలవలస రూరల్: ప్రపంచ కళాకారుల దినోత్సవం సందర్భంగా సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలస గ్రామం సమీపంలో గల సంగమేశ్వర ఆలయం వద్ద కళాకారులకు వందనం చేస్తున్నట్లు సైకత చిత్రం రూపొందించారు.

30 మద్యం బాటిళ్ల స్వాధీనం

కొత్తూరు: మండలంలోని కొత్తూరు, కౌశల్యాపురం గ్రామాల వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 30 మద్యం బాటళ్లతో ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్లు ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ తెలిపారు. పట్టుబడిన మద్యాన్ని సీజ్ చేశామన్నారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. కొత్తూరులో నిర్వహించిన తనిఖీల్లో గొట్టిపల్లికి చెందిన సవర హరిష్ అక్రమంగా తరలిస్తున్న ఆరు మద్యం సీసాలు పట్టుకున్నట్లు చెప్పారు. మండలంలోని కౌశల్యాపురం వద్ద నిర్వహించిన తనిఖీల్లో బలద గ్రామానికి చెందిన వి.అనంత, వి.శివశంకర్‌ల వద్ద చేరో 12 ఒడిశా మద్యం బాటళ్లు పట్టుకున్నట్లు తెలిపారు.

మారిన మాళువ



కార్పొరేట్ ఆఫీస్‌లా ఉన్న గ్రామ సచివాలయ భవనం



మండల పరిషత్ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్



రైతు భరోసా కేంద్రం

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- గ్రామంలోనే అన్ని ప్రభుత్వ సేవలు
- పట్టణాన్ని తలపిస్తున్న గ్రామం

సారవకోట: మండల కేంద్రానికి సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాళువ గ్రామ స్వరూపం వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తరువాత పూర్తిగా మారిపోయింది. మాళువ పంచాయతీలో గిరిజన జనాభా అధికం. ఈ పంచాయతీలో 372 ఇళ్లు ఉండగా 1756 మంది నివస్తున్నారు. ఒకప్పుడు మండల కేంద్రానికి పరుగులు పెడితే గాని పనులు జరిగేవి కావు. ప్రస్తుతం గ్రామంలోనే అన్ని రకాల సేవలు అందుతున్నాయి. ఈ గ్రామానికి చేరుకోవాలంటే నౌతళ, హిరమండల రోడ్డు నుంచి (రాళ్లు తేలిన రోడ్డుపై) వెళ్లావల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ సమస్య లేదు. వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూ.20 లక్షలతో అద్దం లాంటి సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వం ఏర్పడక ముందు గ్రామానికి ఎటువంటి మౌళిక వసతులు లేనిపరిస్థితి. ప్రస్తుతం గ్రామం నైసర్గిక స్వరూపమే మారిపోయి పట్టణాన్ని తలపిస్తుంది. రూ.10 లక్షలు వెచ్చించి భూగర్భ డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతోపాటు ఫుట్‌పాత్‌లను టైల్స్‌తో నిర్మించారు. ఈ పంచాయతీ పరిధిలోని మాళువ కాలనీలో రూ.5 లక్షలతో ఇంటింటికీ కుళాయిలను నిర్మించారు. పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల్లో రూ.లక్ష చొప్పున వెచ్చించి రచ్చబండలు ఏర్పాటు చేశారు. గ్రామస్థాయిలో అన్ని రకాల సేవలందించాలనే ఉద్దేశంతో రూ.45 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించారు. రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.5 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.7 లక్షలతో ఈ గ్రామానికి ప్రారంభంలో నౌతళ, హిరమండలం రోడ్డుకు ఆనుకుని బస్ షెల్టర్‌ను నిర్మించారు. నాడు–నేడు ద్వారా ప్రాథమిక పాఠశాలను రూ.25 లక్షలతో అభివృద్ధి చేశారు. ఇలా అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి రూ.1.53 కోట్లు వెచ్చించారు.



నాడు–నేడుతో అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాల



గ్రామానికి నిర్మించిన సిమెంట్ రోడ్డు

అర్హులకు సంక్షేమ పథకాలు

మాళువ పంచాయతీ పరిధిలోని అర్హులకు అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, వైఎస్సార్ పింఛన్, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ బీమా తదితర సంక్షేమ పథకాలు అందించడంతో డీబీటీ విధానం ద్వారా రూ.5,67,47,676 లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం నగదు జమ చేసింది. జగనన్న విద్యా కానుక, విద్యార్థులకు టాబ్‌లు, రైస్ కార్డులు, జగనన్న తోడు తదితర నాన్ డీబీటీ ద్వారా రూ.81,80,663 ప్రభుత్వం వెచ్చించింది. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ పంచాయతీలోని సవర మాళువ గ్రామానికి 63 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మరలా గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొద్దున్నే పింఛన్ ఇస్తున్నారు



తెల్లవారికే సరికి వలంటీర్ ఇంటికి తెచ్చి పింఛన్ ఇస్తున్నారు. గతంలో పింఛన్ తీసుకునేందుకు సిగ్నల్ వచ్చే దగ్గరకు వెళ్లాల్సి వచ్చేది. రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది.

– కోడికల శిమ్మయ్య, పింఛన్‌దారుడు, మాళువ, సారవకోట

మా గ్రామం అభివృద్ధి చెందింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి, రోడ్డు కిరువైపులా డ్రైన్స్‌పై ఫుట్‌పాత్‌లు నిర్మించి అక్కడ బెంచీలు కూడా ఏర్పాటు చేశారు. గ్రామానికి పూర్తిస్థాయిలో రహదారి, రచ్చబండల నిర్మాణం, పలు కార్యాలయాలు ఏర్పాటుతో గ్రామం సుందరంగా మారింది.

– బల్లా రాంబాబు, మాళువ, సారవకోట

ఓటు హక్కుపై అవగాహన



పాతపట్నం: ప్రతిజ్ఞ చేయిస్తున్న రిటర్నింగ్ అధికారి అప్పారావు

పాతపట్నం: ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీని ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి ఎం.అప్పారావు ఆధ్వర్యంలో పాతపట్నం ప్రధాన రహదారిలో మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి వెంకటేశ్వర ఆలయం, ఆస్పత్రి కూడలి, ఆల్ ఆంధ్ర రోడ్డు, మార్కెట్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. పాతపట్నం మార్కెట్ సమీపంలోని బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు, ఆర్ఐ భువన్‌కుమార్, వీర్వోలు, సచివాలయ ఉద్యోగులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో..

సరుబుజ్జిలి: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం కమలకుమారి పాండ్యన్ అన్నారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో ఓటు వినియోగంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును నిర్భయంగా, నిజాయితీ వేయాలన్నారు. ఈ ర్యాలీలో వెలుగు సీసీ కూన రోజాలత, మహిళా పోలీస్ బాలామణి, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: అవగాహన ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

తాగునీటి సమస్య రాకూడదు

నరసన్నపేట: రానున్న వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో ఎక్కడా మంచి నీటికి ప్రజలు ఇబ్బంది పడకూడదని, దీనికి తగ్గట్టుగా అధికారులు మండల స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, ఎంపీడీఓలకు ఆదేశాలు ఇచ్చారు. ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణ నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నందున మండలాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల స్థాయిలో ఉన్న రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. జల్ జీవన్ మిషన్ నిధులతో ఏయే గ్రామాలకు ఇంటింటికీ తాగు నీరు కల్పించారనేది అడిగి తెలుసుకున్నారు. అన్ని తాగునీటి పథకాలు సక్రమంగా పనిచేసే చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్, మండల స్థాయి అధికారులకు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్‌భాస్కర్, ఉపాధి ఏపీఓ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

పేదల ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి



పొందూరు: ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- ఎన్నికల ప్రచారంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పొందూరు: రాష్ట్రంలోని పేద ప్రజలంతా ఆత్మాభిమానంతో, గౌరవంగా జీవించేలా సంక్షేమ పథకాలను నేరుగా వారి ఖాతాల్లోకి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వేశారని స్పీకర్ తమ్మినేని సీతారాం కొరారు. పొందూరు పంచాయతీలోని పలు వీధుల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. పేదల అభివృద్ధికి, సంక్షేమానికి మరోసారి వైఎస్ జగన్‌ను సీఎంగా ఎన్నుకోవాలని కోరారు. సంక్షేమ పథకాలను మహిళల పేరుతో ఇవ్వడం, నామినేటెడ్ పోస్టుల్లో సైతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యమివ్వడం జరిగిందన్నారు. ఆమదాలవలస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, దువ్వాడ ప్రసాదరావు, కిల్లాన సూర్యారావు, బాడాన సునీల్‌కుమార్, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బందారు జైప్రతాప్‌కుమార్, గుడ్ల మోహన్, పప్పల రాధాకృష్ణ, వడగ పద్మావతి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'గుడ్‌మార్నింగ్' మమేకం..

మెళియాపుట్టి: వినూత్న రీతిలో ప్రజల మధ్యకు వెళ్లాలనే ఉద్దేశంతో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు శ్రావణ్ గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం మెళియాపుట్టి, చాపర గ్రామాల్లో 'గుడ్ మార్నింగ్' కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలను కలుస్తున్నారు. మార్కెట్లో చిరువ్యాపారులతో కలిసి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు.

మార్నింగ్ వాక్‌కు వెళ్లిన రిటైర్డ్ ఉద్యోగులు, మహిళలు, యువకులను కలిసి సీఎం జగన్ అందించిన జనరంజక పాలనను వివరించారు. రెడ్డి శాంతిని రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, పార్టీ మండల నాయకుడు ఉదయ్ కుమార్, మండల కన్వీనర్ పల్లియోగి, పీఏసీఎస్ అధ్యక్షుడు యు.బాలరాజు, సర్పంచులు పున్నయ్య, ఉర్లాన రవి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించండి

ఆమదాలవలస రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తమ్మినేని సీతారాంను అత్యధిక మెజార్టీలో గెలిపించాలని పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ కోరారు. మండలంలోని గాజులకొల్లివలస, కామిరెడ్డిపేట, శ్రీహరిపురం, రాధాకృష్ణాపురం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తమ్మినేని సీతారాంను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, సర్పంచ్ మొండేటి సుజాత, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మొండేటి కూర్మారావు, కామిరెడ్డి రమణ, బొడ్డేపల్లి శేఖర్, పేడాడ శ్యామ్, బమ్మిడి అచ్యుతరావు, చిగురుపల్లి దశరథ, గురుగుబెల్లి చలపతిరావు, అంబటి లక్ష్మణరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: చాపరలో చేపల వ్యాపారులకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న రెడ్డి శ్రావణ్

సంక్షేమ పథకాల అమల్లో ఆదర్శం



కొత్తూరు: ఆర్‌కేపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఓం శ్రీకృష్ణ

కొత్తూరు: పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓం కృష్ణ అన్నారు. మండలంలోని మదనాపురం, ఆర్‌కే పురం గ్రామాల్లో మేం సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పేదలకు న్యాయం జరగాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేయాలని కోరారు. పాతపట్నం నియోజవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతిని, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, సర్పంచ్ కొంచాడ వెంకటరమణ, జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, గ్రామ సచివాయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, బానాలు తవిటినాయుడు, ప్రచార కార్యదర్శి పంకజదాస్, గజపతి, పార్టీ నాయకులు సర్పంచ్ బోర సింహాద్రినాయుడు, బి.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, సర్పంచ్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: గాజులకొల్లివలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చిరంజీవినాగ్

గిరిశిఖర గ్రామాల్లో ప్రచారం..

మెళియాపుట్టి: కులం, మతం, వర్గం చూడకుండా అన్ని వర్గాల వారికి ప్రాధాన్యతనిస్తూ సంక్షేమాన్ని అందించిన గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, మళ్ళీ జగనన్నను గెలిపిస్తేనే పేదల ప్రభుత్వం వస్తుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఉత్తరాంధ్రలోనే ఎత్తైన గిరిశిఖర గ్రామాలైన కేరాసింగి, చందనగిరి, గూడ గిరిజన గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కొండకోనల్లో ఉన్న గిరిపుత్రులను కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వారికి జరిగిన లబ్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మండలంలోని గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పించామన్నారు.గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చి రైతు భరోసా కూడా అందేలా చేసిన గొప్పవ్యక్తి జగనన్న అన్నారు. గిరిశిఖర గ్రామాలకు సైతం ప్రత్యేకంగా ట్రాక్టర్ ఏర్పాటు చేసి రేషన్ సరుకులు అందిస్తున్నామన్నారు. మళ్లీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించడం ద్వారా గిరిజన గ్రామాలె మరింత అభివృద్ధి చేందుతాయన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తనని రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, మండల నాయకుడు ఉదయ్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు యు.బాలరాజు, కోప్షన్ సభ్యుడు భాస్కరదాస్, నాయకులు రామచంద్రమజ్జి, జయమునిరావు, బాబూరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కేరాసింగిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సంక్షిప్తంగా..

ఓటింగ్ శాతం పెంచాలి

కొత్తూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సెక్టోరియల్ ఆఫీసర్లకు పాతపట్నం నియోజకవర్గం ఆర్వో ఎం.అప్పారావు సూచించారు. కొత్తూరు మండలంలోని ఎన్నికల ఏర్పాట్లపై తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్ సక్రమంగా పని చేయకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయాలని ఆర్వోకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎన్నికల సిబ్బందితో ఆర్వో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకువచ్చేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ గిరీష్‌కుమార్, వీర్వోలు పాల్గొన్నారు

403 మందికి వైద్య పరీక్షలు

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం గ్రామ సచివాలయంలో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బూర్జ పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. 403 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యుడు జి.రాజశేఖర్ తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు, బూర్జ పీహెచ్‌సీ డాక్టర్ ఐ.పావని, సీహెచ్‌ఓ కె.అప్పలస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.25 లక్షలు

నరసన్నపేట: స్థానిక వెంకటేశ్వరాలయం హుండీని మంగళవారం లెక్కించారు. ఆరు నెలలకు హుండీ లెక్కించగా రూ.2,25,199 ఆదాయం వచ్చిందని ఈఓ వెంకటరమణ తెలిపారు. హుండీ లెక్కింపునకు అబ్జర్వర్‌గా శ్రీకాకుళం భీమేశ్వరస్వామి ఆలయం శ్రీకాకుళం ఈఓ మాధవి హాజరయ్యారు.

రహదారి నిబంధనలు పాటించాలి

కొత్తూరు: వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని సీఐ ఆర్.వేణుగోపాలరావు సూచించారు. మండలంలోని అంతర రాష్ట్ర చెక్ పోస్టు మాతల వద్ద వాహన చోదకులతో సమావేశం నిర్వహించారు. విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ వెంట తీసుకురావాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశం అనంతరం నిర్వహించిన వాహన తనిఖీల్లో 40 మంది నుంచి రూ.23 వేల అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ ఉన్నారు

వైభవంగా చక్రతీర్థ స్నానాలు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని రాధా గోవిందుని డోలోత్సవాలు ఇటీవల ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం మహేంద్రతనయ నదిలో ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలను ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. మెళియాపుట్టి, చాపర పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

హద్దులు గుర్తించాలని వినతి

నరసన్నపేట: స్థానిక సంతపేట ఎదురుగా ఉన్న శ్మశాన వాటికను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు నరసన్నపేట లయన్స్ క్లబ్ నిర్ణయించందని క్లబ్ అధ్యక్షుడు సదాశివుని కృష్ణ అన్నారు. శ్మశాన వాటికకు సరిహద్దులు నిర్ణయించి, మార్కింగ్ చేయాలని స్థానిక తహసీల్దార్ పి.కనకరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు సదాశివుని కృష్ణ, ఊణ్ణ రంగనాథ్, వి.నాగరాజు, పి.రమేష్ మాట్లాడుతూ స్థానికులతో ఒక కమిటీని వేసి, ఆ కమిటీ ఆధ్వర్యంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపడతామన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులను తహసీల్దార్ అభినందించారు. వీలున్నంత తొందరగా సరిహద్దులు నిర్ణయించి తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

వేసవి పంటలతో ప్రయోజనం

సరుబుజ్జిలి: రబీ సీజన్లో మొక్కజొన్న పంట అనంతరం పొలాలను ఖాళీగా ఉంచకుండా వేసవి పంటలను వేయడం వల్ల భూగర్భ జలాలను పరిరక్షించవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు తెలిపారు. మండలంలోని వీరమల్లిపేట, సవలాపురం జంక్షన్, రొట్టవలస గ్రామాల్లో రైతులు వేసవి పంటలు వేసుకునేందుకు మినుము, నువ్వు విత్తనాలు మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయ కర్త ఎ.లావణ్య, రైతులు తిరుపతిరావు, విజయభాస్కర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఆమదాలవలస: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఆమదాలవలస ఎస్ఐ కె. వెంకటేష్ సూచించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, హెల్మెట్ ధరించని ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.